# హద్దురాయి

ఆ హద్దురాయి ముందు నిలుచొని ఆలోచిస్తున్నాడు సోములు-

అతని కడుపులో ఆకలి ఉంది. ఆవేదన ఉంది. చుట్టూ కటిక చీకటి ఉంది.

ఆ ఊళ్ళోని కల్లుపాకల గూర్చి, కన్నెపిల్లల గూర్చి సోములు ఆలోచించడంలేదు. రాబోయే పండుగల గూర్చి, పట్నం సరదాలగూర్చి ఆలోచించడం లేదు.

వాళ్ళ పండుగలన్ని ఆ హద్దురాయి క్రింద పాతిపెట్టబడ్డాయి. వాళ్ళ నవ్వులన్నీ లాగేసి ఒంటి నిండా పూసుకొని తెల్లగా మెరిసిపోతోంది హద్దురాయి!

తీర్పు చెప్పే న్యాయమూర్తిలా కూర్చున్న ఆ రాయి చిన్నయ్య దొర పొలం సోములు వాళ్ళ పొలం హద్దులకు కాపలా!

ఆ రాయి, దాని కాపలా ఇప్పటివికావు తరతరాలనాటివి!

రాయికి వాగుకు మధ్యది సోములు వాళ్ళ పొలం. రాయికి ఆవలివైపుది చిన్నయ్య దొర పొలం.

ఆ హద్దురాయికి నడిచే అలవాటు ఉన్నది అందుకే తరం మారుతున్న కొలది దాని తావు మారుతున్నది.

రానురాను రాయికి, వాగుకు మధ్య దూరం తగ్గిపోతున్నది.

ఆ దూరం తగ్గి తగ్గి....

ఆ రాయి వాగువైపు నడిచి నడిచి అందులో పడిపోయినా ఆశ్చర్యం లేదు!

అప్పుడు రాయేకాదు సోములు వాళ్ళ బ్రతుకులూ వాగులో పడతాయి!

ఆకాశంలో సూర్యుడు లేడు! చంద్రుడు లేడు! కనీసం నక్షత్రాలైనా లేవు!

వాగులో నల్లని చీకటి ప్రవహిస్తోంది! సోములు కళ్ళు ఎర్రగా వున్నాయి. సోములు కళ్ళలో ఆశల చితి మండుతున్నది!

ఈ మధ్య చిన్నయ్య చాలా పెద్దోడయాడు. పదే పదే "పేద ప్రజలు", 'వీకర్ సెక్షన్' అన్న పదాలు వాడి, రాజకీయ నాయకుడైపోయాడు!

*           *           *

భీమయ్య ముందు చేతులు కట్టుకొని నిల్చున్నాడు రాజయ్య.

దొరగారిముందు చేతులుకట్టుకొని నిల్చున్నాడు రాజిగాడు!

వాగునానుకొని రాజయ్య పొలం ఉంది. ఆ పొలం పక్కన భీమయ్య పొలం ఉంది. ఆ రెండు పొలాలమధ్య హద్దు రాయి ఉంది.

రాజయ్య పొలం ఉన్నవాడిలాలేడు. పొలం దున్నేవాడిలా ఉన్నాడు.

భీమయ్య పొలం దున్నేవాడిలాలేడు. పొలం ఉన్నవాడిలా ఉన్నాడు.

భీమయ్య పొలాన్ని, తన పొలాన్ని తనే దున్నుతున్నవాడిలా గున్నాడు రాజయ్య.

రాజయ్య పొలంలో పండినవి. తన పొలంలో పండినవి తనే అనుభవిస్తున్న వాడిలాగున్నాడు భీమయ్య !

''పిలిచిండ్లట బాంచెను........'' చేతులు కట్టుకొని నిల్చున్న రాజయ్య అడిగాడు.

''ఏందిరా పొరగాని పెండ్లని, నాట్లని, కోతలని, అదని ఇదని అప్పు తీసుకపోతివి-అప్పడేపాయె. మిత్తి అటెపాయెనేందిరా ?'' అన్నాడు విలాసంగా దిండు కానుకొని కూర్చున్న భీమయ్య.

''అట్లంటరు భా చెను....ఏట వడ్లు కొలుత్తానగాదు''

పండిన దాంట్లో సగానికి పైగా దొరకు కొలుస్తుంటాడు ప్రతిసారి రాజయ్య.

''అది మిత్తి కిందనే పోతాంది కాదురా - పోయినేడు అదికూడా ఇయ్యక పోతివి, ఇట్ల ఎన్ని దినాలు ఆగమంటవురా ?''

''ఎట్ల బాంచెను కాలం అయిత లేదుగాదు !''

''కాలం గాకపోతె అప్పెగ్గొడుతావుర ?''

''ఛా-నేనట్లాసంటోన్ని కానుదొరా- చెర్మం ఒలిచి మీకు చెప్పులు కుట్టించి ఇచ్చైనా అప్పు తీరుసుత''

''ఆఁ....నీ తోలు చెప్పులు నాకెందుకు గాని అసలు సంగతి జెప్పవు.... మిత్తెప్పుడి స్తవు ? అసలెప్పుడు కడుతవు ? అప్పు ఎంటనే కట్టాలే !''

''జెర ఆగాలె దొరా....ఈ యేడు కాలమైతె సగం పైసలన్నా కడుతా-''

''కాలమైతది పైసలు కడుతావు-అప్పటిదాకా సేటు ఆగుతాడు ? మీ బాధలు సూడలేక కాదుర పట్నంల సేటు దగ్గఱ అప్పుతెచ్చి ఇచ్చిన నేనాగుతె సేటు ఆగు తాడ్ర ?''

''ఎట్లనో తవఁరే జెర సగచెప్పాలె - మీ బాంచెను-గులాపోన్ని-''

''మారె....ఇనడు ఇనడు-సేటు అస్సలకే ఇనడు-ఇప్పుడు పైసలు కావా ల్నని మన్సుల బంపుతాడు-''

''ఎట్ల బాంచెను-తిండికే ఇబ్బంది అయితాంది గాదు !''

''బుగులేందిరా ! అ వాగుపక్క-పొలం లేదూ-సగం అమ్మేయి.... అప్పు తీర్తది మిత్తి. మిగతది ఏమన్న ఉంటే అటెంక నిమ్మలంగ కడ్తువు. నేను సగ చెబుతలే-ఏం జేయాలె !''

''సగం పొలం అమ్మి కట్టేంత అప్పున్నాది ! గంత అప్పెక్కడిది ?'' అన్న ప్రశ్న రాజయ్య గొంతులోనే ఉండిపోయింది.

"సేటు వచ్చిందంటె బొడ్లెచెయ్యేసి బొట్రాయికాడ్కి ఈడ్చుతడు. పొలం ఏలం ఏస్తడు. వండు కుండలు బైట పెడ్తడు. ఏదో మనం మనం ఒకరి కొకరం తెలిసినోళ్ళం- గంత బదునాం ఎందుకె తవని ముందుగాల్నె చెబుతాన. అటెంక నీ ఇష్టం - ఎవ్వలకన్న అమ్ముకో నేను కాదన" అన్నాడు బొమ్మల మీది నుంచి రాజయ్యను పరిశీలనగా చూస్తూ భీమయ్య.

రాజయ్య బాగా ఆలోచించాడు- "ఎవ్వలకెందుకు బాంచెను - తమ పక్కనే ఉన్నది. తమరికైతెనే కలుస్తది" అన్నాడు.

"మారె....నా దగ్గఱ డబ్బెక్కడిది! ఎవలనన్న అడిగి సూస్తలే-పాపం! కష్టంల ఉంటివి!"

రెండు చేతులు జోడించాడు రాజయ్య.

రాజయ్య చేతులు దండం పెట్టడానికి, యాచించడానికి, పనిచేయడానికి తప్ప కడుపునిండా తినడానికి ఉపయోగపడవు.

తలవంచుకొని దిగులుగా ఇంటికి వచ్చాడు. "ఉన్న ఆదెరు వొక్కటిపోతె నేనేం గావాలె? రేపు నా కొడుకు గతేం గావాలె? గంతపెవ్పట్లయింది తల్లీ" అంటూ అమ్మవారిని తలుచుకొని ఏడ్చాడు.

అమ్మవారూ హద్దురాయిలాగే అన్నీ చూస్తూ ఊరుకున్నారు!

తండ్రి చెప్పింది విని శివయ్య ఉగ్రుడాయ్యాడు. పొలం అమ్మడానికి వీల్లేదన్నాడు.

కాని శివయ్య కోపం పెదవికిచేటు!

భీమయ్య. రాజయ్య పొలాలమధ్య నున్న హద్దురాయి వాగువైపు. రాజయ్య గుండెలవైపు జరిగింది!

అలా ఏదో ఒక కారణంగా ఆ హద్దురాయి వాగు వైపు జరుగుతూనె ఉంది. ఒక వైపున్న పొలాన్ని పెంచుతున్నది. మరో వైపున్న దాన్ని తగ్గిస్తున్నది.

ఒక వైపు ఆస్తిని పెంచుతున్నది.

మరొకవైపు ఆకలిని పెంచుతున్నది.

భీమయ్యకు కొడుకులు లేరు. ఒకే ఒక కూతురుంది. ఆ కూతురిపై అమిత మైన ప్రేమ ఉంది అందుకే పెళ్ళిచేసి అల్లుణ్ని ఇంట్లోనె పెట్టుకున్నాడు. ఆ అల్లుడు భీమయ్య కూతురికేకాదు ఆస్తికీ మొగుడయ్యాడు.

ఆస్తి వ్యవహారాలు ఆ విధంగా అల్లుడు చిన్నయ్య చేతిలోకి వచ్చాయి. ఆస్తిని ఎలా కాపాడు కోవాలో, ఎలా పెంచుకోవాలో భీమయ్యకంటె చిన్నయ్యకే బాగా తెలియును. పట్నంలోఅతడు కొంతవఱకు చదువుకున్నాడు మరి!

ఆ ఊరి ప్రక్కనుంచి రోడ్డు వేసే ప్రయత్నాలు జరిగాయి ఒకసారి. ఆరోడ్డు తన చెలకలో ఒక ప్రక్కనుంచి పోతుందని తెలిసి అది వేయకముందె

ఆ ప్రక్కన పెద్ద బావి తవ్వించాడు నాలుగైదు గుడిసెలు వేయించాడు చిన్నయ్య. ఆ విధంగా ఆ ఊరుకు రావలసిన రోడ్డు కాస్త దూరంగా వెళ్ళిపోయింది.

పట్నం పోవలసిన ప్రక్క ఊర్లకు పోవలసిన ఆఊరి ప్రజలు అంతదూరం, బస్సులు నడిచే రోడ్డుదాకా వెళ్లాలంటె ఎంత కష్టమో చిన్నయ్యకు అవసరం లేదు। —

అర్జంటుగా హాస్పటల్‌కు తీసుకపోవాల్సిన వాళ్ళుంటారు. నడవలేని వాళ్లుంటారు. సామాన్లు తెచ్చేవాళ్ళుంటారు. పిల్లలు, పసిపిల్లల తల్లులు, ముసలివాళ్ళు ఉంటారు. బస్సెక్కాలంటె వాళ్ళంతా ఎండలో, వానలో ముళ్ళలోంచి, రాళ్ళ రప్పల్లోంచి బస్సులు నడిచే రోడ్డుకు నడవాల్సిందే।

సీలింగ్ వస్తోందని తెలిసి భూములన్నీ కాగితాలమీద విభజించి భార్య పేర, మరో భార్యను చేసుకొని ఆమె పేర, ఆమె నాన్న పేర, ఆమె తమ్ముని పేర, ఆ తమ్ముని భార్య పేర, తన కూతురు పేర, అల్లుని పేర ఆ కూతురుకు సంతానం లేనందుకు విచారించి ఆ అమ్మాయి ప్రేమతో పెంచుకుంటున్న కుక్కకు 'రాజు' అని పేరు పెట్టి ఆ రాజు పేర రాశారు.

అలాంటి చిన్నయ్య ఇప్పుడు ప్రజాసేవ చేయటం కోసం రాజకీయాల్లో ప్రవేశించి పార్టీలు మారుతున్నారు. పేద ప్రజలు, వీకర్ సెక్షన్‌లు అన్న పదాలు వాడుతున్నారు. పార్టీలేకపోతే, అసెంబ్లీ మెంబరో, పార్లమెంటు మెంబరో కాకపోతే, ఆ తరువాత మినిష్టరు కాకపోతే ప్రజాసేవ చేయలేనని చిన్నయ్యగారి అభిప్రాయం।

శివయ్యకు కొడుకు పుట్టాడు.

వాళ్ళ వాళ్ళు "తొలూస్రి కాన్పు పురుడు మంచి జెబర్‌గా చేయి" అంటె శివయ్య చేయనన్నాడు. అప్పచేయటం అతని కిష్టంలేదు. హద్దురాయి ఇంకా జరుగుతుందేమోనని భయం.

ఒకరోజు ఉదయం పొలంకు వెళ్ళాడు శివయ్య. చిన్నయ్య జీతగాడు హద్దురాయి తీసి ముందుకు జరిపి పోతున్నాడు. "మా దొర చెప్పినట్లు చేస్తాన" అన్నాడు. తంగేడిపుల్ల నములుతూ దూరంగా గట్టుమీద నిల్చున్నాడు చిన్నయ్య.

ప్రాణం పోయినాసరే హద్దురాయిని కదలనివ్వనన్నాడు శివయ్య.

ఫలితంగా వాగులోపడి గిలగిలా కొట్టుకున్నాడు। నెత్తి నోరు బాదుకుంటూ రాజయ్య వచ్చాడు.

"బాకీ ఉంటే మాకు చెప్పకుండనె భూమి తీసుకుంటారు దొరా?" అని అడిగాడు దీనంగా—

"మీకు చెప్పేదేందిరా.... పూటగ్గతిలేనోళ్లు బాకీ తీరుస్తారు? లెఖ్ఖ చూసి వచ్చేకాడికి భూమి తీసుకున్నా....'' అన్నాడు చిన్నయ్య తాపీగా—

''నా దగ్గల నక్రాలు పనికిరావు- చెముడలొలిపిస్త బిడ్డా ఏమనుకున్నవో, వీన్ని తీసుకపోయి బుద్ధిచెప్పు-లేకపోతె నీళ్ళడుగకుండ పోతడు'' అని బెదిరించాడు.

"సరె బాంచెను. అంటూ రెండు చేతులు జోడించాడు రాజయ్య.

దొరగారి పొలం పక్కన తనలాంటి బక్కపలుచనివాని పొలం ఉండ కూడదు !

దొరగారు ఉన్న ఊళ్ళో తనలాంటివాడుండకూడదు !

దొరగారున్న దేశంలో తనలాంటివాడుండకూడదు !

అసలు దొరగారున్న భూమ్మీదే తనలాంటి వాడు ఉండకూడదు ! — అను కున్నాడు రాజయ్య.

ఈ భూమి తగాదావల్ల తన కొడుకునేం చేస్తారో నని భయంతో గజగజ వణికిపోయాడు. కుమిలి కుమిలి ఏడ్చాడు రాజయ్య. ఆ దిగులుతోనె నెల రోజులు మంచం పట్టాడు. ఒకరోజు కొడుకును దగ్గటికి పిలుచుకొని- "అద్దు రాయి జరిగితె జరగనియ్యి బిడ్డా !.... నువ్వు ఆళ్ళ తెరువుకు బోకు, ఉన్ననాడు తిను - లేనినాడు నీళ్ళు తాగి పండుకో. ఎవ్వలతో లడాయి పెట్టుకోకు నాయినా...." అని కడుపులో తల పెట్టుకొని ఏడ్చి ఏడ్చి అలాగే ప్రాణాలు వదిలాడు.

* * *

వాగుకు, హద్దురాయికీ మధ్య దూరం ఇప్పుడు చాలా తగ్గిపోయింది.

హద్దురాయి వాగుకు చేరువవుతోంది.

శివయ్య కుటుంబం వాగుకు చేరువవుతోంది.

శివయ్య కొడుకు సోములు పెరిగి పెద్దవాడయ్యాడు. అంతో ఇంతో ఆ ఊరి బడిలో ఉన్నంతవరకు కొడుక్కు చదువుచెప్పించాడు శివయ్య. సోములుకు చదువు మీద ఆసక్తి ఉంది. వాళ్ళను వీళ్ళను పుస్తకాలు అడుక్కొచ్చుకొని చదువుకునే వాడు. న్యూస్ పేపర్లు పాతవి తెచ్చి చదివేవాడు. సోములుతో చదుకున్న పిల్లలు కొంతమంది పట్నంపోయి పెద్ద చదువులు చదువుతున్నారు.

తన కొడుక్కు ఆ అవకాశంలేదు అని విచారించాడు శివయ్య. తన కొడుకు కొడుక్కు ఆ అవకాశం వస్తుందో రాదో తెలియదు.

తమ బ్రతుకులు రానురాను బాగుపడుతూ లేవు చెదలు పట్టినట్లు క్షీణించి పోతున్నాయి. చీకేసిన మామిడి పిక్కలవుతున్నాయి. పిసికిన పొదుగులవు తున్నాయి కరిగిపోతున్న కొవ్వొత్తులవుతున్నాయి.

మిగిలిన పొలం కష్టపడి సాగుచేస్తూ ఆశలన్నీ పంటమీద పెట్టుకొని-ఏకాస్త తీరిక దొరికినా ఏ పని దొరికితే అది చేస్తున్నాడు శివయ్య.

పంట కోతకొచ్చింది. ఒకరోజు ఉదయం కొడవండ్లు తీసుకొని కొడుకు కూతురు, భార్యను వెంట పెట్టుకొని పొలంకు వెళ్ళాడు.

పొలంలో అడుగు పెట్టడంతోనే అతని తలమీద పిడుగుపడినట్లయింది! హద్దురాయి తీసి రెండు గుంటల ముందుకు జరిపి పాతాడు. దాని వెంట కొత్తగా ఒడ్డు పెట్టారు.

కాపలా ఉన్న చిన్నయ్యదొర పాలేర్లు కనిపించారు. 'పాతబాకీ ఏదో తేలిందట కడితే బాకీ కట్టమన్నడు. లేకుంటె రెండు గుంటల పొలం ఇడిసిపెట్టమన్నడు దొర" అన్నాడొక పాలేరు.

"బాకీ ఉంటె పంట అమ్మి కడుతగాని పొలం ఇయ్యనని చెప్పు మీ దొరతో" అన్నాడు శివయ్య. "బాకీ కట్టందే పంట కొయ్యనీయద్దు అన్నాడు దొర."

"మా పంట కోయద్దనడానికి ఆయనెవరు?" అంటూ కోపంగా ఆ కొత్త ఒడ్డును తీసెయ్యడానికి వంగాడు శివయ్య.

అంతే తిరిగి లేవలేదు. పెడా పెడా అతని తలపై కట్టె దెబ్బలు పడ్డాయి. రక్తం మడుగులో కుప్పలా కూలిపోయాడు శివయ్య. అడ్డం వచ్చిన భార్యను, కొడుకును, కూతురును కొట్టారు.

అది అడివైతే జంతువులున్న అడివైతే-వాళ్ళపై జరుగుతున్న అత్యాచారానికి ఏ జంతువో జాలిపడి అలా కొడుతున్న వాళ్ళమీద పడేదేమో!

కొడుకు, కూతురు, భార్య శివయ్యను ఇంటికి చేర్చారు. కొన ఊపిరిలోనున్న శివయ్య కొడుకును దగ్గిరకి తీసుకున్నాడు అతనిలోని ఉడుకు తగ్గిపోయింది. ఉద్రేకం తగ్గిపోయింది. అన్యాయాన్ని చూసి కోపంతో బుసలుకొట్టిన ఆ పడగ వాలిపోయింది. కొడుకేమవుతాడోనన్న దిగులు, బెంగ బరువైన ఆ కనురెప్పల క్రింద కొట్టుకుంటున్నాయి. ''బిడ్డా '' అంటూ వాలిపోతున్న రెండు చేతుల్తో కొడుకును పట్టుకున్నాడు. అలా కొడుకును చుట్టేసినవి చేతులుకాదు. అతని కడుపులోని పేగులు! కడుపులోని భయమంతా కళ్ళలోంచి దుముక సాగింది. ''ఆ హద్దురాయి జోలికి పోకు బిడ్డా.... అది వాగుల పడ్డనాడు ఈ ఊరి విడిచి అవ్వను, చెల్లెను తీసుకొని ఏ అడవికన్నా పారిపో-ఆకులు అలములు తిని బతుకుండ్లీ ...''అని చెప్పి ప్రాణాలు వదిలాడు.

0 0 0

మిగిలిన చిన్న మడి చెక్కను సాగుచేస్తూ, కూలినాలి చేస్తూ ఓ పూట తింటూ, ఓ పూట పస్తులుంటూ కుటుంబ భారాన్ని మోస్తున్నాడు సోములు—

ఒక రోజు సాయంకాలం—

పొలంలో పనిచేసుకుంటున్నాడు సోములు—

చిన్నయ్యగారి దొర కూతురు వచ్చింది పొలం చూడటానికి.

ఆమె వెంట ఓ ట్రాన్సిస్టరు, ఒక కుక్కపిల్ల, ఒక మొగడు ఉన్నారు!

ట్రాన్సిస్టరును చంకనేసుకొని కుక్కపిల్లను ఎత్తుకొని, మొగని భుజంమీద విలాసంగా చేయివేసి – "ఇదంతా మన పొలమే'' అని చూపించింది వాగుదాకా!

మధ్యనున్న హద్దురాయి ఆ అమ్మాయి కంటికి కనిపించడంలేదు!

ట్రాన్సిస్టరు పాట పాడుతున్నది. కుక్కపిల్ల కుస్‌కుస్ మంటున్నది మొగుడు ''ఓ....ఐసీ—'' అన్నాడు.

ట్రాన్సిస్టరు దమ్ మారో దమ్ అంటున్నది.

కుక్కపిల్ల బిస్కట్ ముక్క.... బిస్కట్ ముక్క అంటున్నది (తన భాషలో).

''ఆ అబ్బాయి ఎవరు ?'' అని అడిగాడు ఇంగ్లీషులో మొగుడు.

''వాడా ?.... మన జీతగాడు! హీ ఈజ్ అవర్ సర్వెంట్-'' అంది అతి నాజూగ్గా ఆ చిన్న దొరసాని.

ఆ మాటలు సోములు చెవినపడ్డాయి. వంగి పని చేసుకుంటున్నవాడల్లా లేచి నిల్చున్నాడు. చేతిలో పారపట్టుకొని అలాగే చూస్తుండి పోయాడు!

"ఏం చూస్తున్నావురా ఫూల్! పని చేయడాని కొచ్చావా? దిక్కులు చూడ టానికా? సిన్సియర్‌గా పనిచేయకపోయావో డిస్మిస్ చేస్తా జాగ్రత్త!-" అందా అమ్మాయి ట్రాన్సిస్టరును, కుక్కపిల్లను. మొగన్ని వెంటబెట్టుకొని వెళ్ళిపోతూ-

మనసు అగ్గిలాగయింది-

ఆ మాటలు బాకుల్లా సోములు గుండెలో గుచ్చుకున్నాయి.

* * *

హద్దురాయి ముందు నిలుచొని ఆలోచిస్తున్నాడు సోములు.

ఆలోచిస్తున్న కొలది అతని రక్తం వేడెక్కిపోతున్నది. ఉడికిపోతున్నది.

పిడికిలి బిగుసుకొంటున్నది.

చిన్న దొరసాని మాటలు చెవుల్లో మారుమ్రోగుతూ అతని ఉద్రేకాన్ని ఇంకా రెచ్చగొడుతున్నాయి.

ఈ హద్దురాయి స్థానం ఏమిటి ?

ఇది ఒక నాటకం-ఒక బూటకం.

ఇది ఆస్తుల కాపలాదారుకాదు. బలవంతుడి చేతిలోని కీలుబొమ్మ. బల హీనుడి గుండెల్లో దిగే పిడిబాకు!

"దీన్ని తీసి వాగులో పడేస్తా అప్పుడే హద్దూ వుండదు. నాకు చేతనైనంత నేల దున్నుకొని బ్రతుకుత. ఎవరు అడ్డొస్తారో చూస్తా" అని వంగిన సోములు క్షణకాలం ఆగాడు. ఆ క్షణంలో అతడెంతో వివేకవంతుడైనాడు.

ఆ హద్దురాయి ముందుకు జరుగుతూ పాములా పాకుతూ, పొలాన్ని మింగేస్తుంటే తానలా చూస్తూ ఊర్కోలేడు. తండ్రిలా ఎదిరించి తల్లిని, చెల్లిని అనాథల్ని చేయలేడు మరి తనేం చేయాలి ?

ఆకాశంలోకి ఒక నక్షత్రం వచ్చింది.

సోములు కళ్ళల్లో ఒక దృశ్యం కదలాడింది. అది రెండు రోజుల క్రితం రెండు కోడిపెట్టలు పిల్లిని ఎదిరించిన దృశ్యం-

ఆ పిల్లి రోజుకో కోడిపిల్లను మాయం చేస్తుండేది. పాపం పెట్ట ఎదిరించాలనుకునేది కాని ధైర్యం చేయలేకపోయేది. చివరికి దానికి రెండే రెండు పిల్లలు మిగిలాయి. మరో పెట్ట పరిస్థితి అలాగే వుంది. ఒకరోజు ఆ రెండు పెట్టలు తమ మిగిలిన పిల్లలతో పెంటమీద ఆహారం ఏరుకొని తింటున్నాయి.

కోడిపిల్లలను తిన మరిగిన పిల్లి వచ్చింది.

పెట్టలు ఆ పిల్లిని పసిగట్టాయి. "కొకొకొక్కో" అన్నాయి. పిల్లలు భయంతో పారిపోయి ఒక మూలకు ఒదిగాయి.

ఆ రెండు పెట్టలు రెక్కలువిప్పి ముక్కు చాపి "కొకొక్కో" అంటూ పిల్లి మీదికి దూకాయి

రెండువైపుల నుంచి తన మీదికి వస్తున్న పెట్టల ధాటికి ఆగలేక పిల్లి తోక ముడుచుకొని కాలికి బుద్ధి చెప్పింది.

కోడి పిల్లలు భయం వదిలి తమ తల్లిని చేరాయి. తిరిగి ఆహారం ఏరుకోసాగాయి. ఆకాశంలోకి మరికొన్ని నక్షత్రాలు వచ్చి చేరాయి.

సన్నగా వెలుగొచ్చింది.

వాగులోని ప్రవాహంపై ఆ వెలుగుపడింది. ఆ వెలుగును చూస్తూ ఆలోచిస్తున్నాడు సోములు.

(పుస్తక ప్రపంచం - సెప్టెంబరు, 1978)